

19వ వసంతంలోకి ...

# సూర్య

నేటి దినపత్రిక


www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,10 డిశంబర్ 2025 | 8 పేజీలు

## అన్నవరం ఈవో వీర్ల సుబ్బారావు

# బదిలీ



వేండ్ర త్రినాధరావు



- 'సూర్య' సంచలన కథనాలకు ప్రభుత్వం చర్య!
- అవినీతి ఆరోపణలు, కుటుంబ జోక్యంపై వేటు
- ఆర్జేడీ త్రినాధరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగింత










'అన్నవరం ఈవో సుబ్బారావు అక్రమాలపై సూర్యలో సంచలన కథనాలు'

**ఉమ్మడి గోదావరిజిల్లాల సూర్యబ్యూరో :** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా పని చేసిన వీర్ల సుబ్బారావును ప్రభుత్వం తక్షణమే బదిలీ చేసింది.ఆలయ పరిపాలనలో చోటుచేసుకున్న తీవ్ర అవినీతిఆరోపణలు మరియుఈవోకుటుంబ సభ్యుల అధికజోక్యంపై భక్తుల మనోభావాల పరిరక్షణకు సామాజిక బాధ్యతగా 'సూర్య' దినపత్రికలో ప్రచురితమైన వరుస సంచలన వాస్తవ కథనాలే ఈబదిలీకి ప్రధాన కారణంగా భక్తులు కొనియాడుతున్నారు.

**అవినీతి, కుటుంబ జోక్యం ప్రధాన ఆరోపణలు**

కొద్ది రోజులుగా ఈవో వీర్ల సుబ్బారావుపై లెక్కకు మించిన అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా, ఈవో ధర్మపత్ని ఆలయ ఆచారాలు, సాంప్రదాయాల విషయంలోనేరుగాజోక్యం చేసుకుంటూ, వైదిక ధర్మాన్ని భ్రష్టు పట్టించేలా వ్యవహరించారనే ప్రధాన ఆరోపణ బలంగా ఉంది.

**భ్రష్టు పట్టిన పాలన..**అన్నవరం కొండపై అధిక ధరలతో భక్తుల దోపిడి,వ్రతపురోహితుల అక్రమాలకు ఈవో పరోక్ష సహకారం అందించారని 'సూర్య' కథనాలు ఆధారాలతో సహా ఎత్తి చూపాయి. జిల్లా కలెక్టర్ షాణ్మోహన్ వ్రత పురోహితుల భక్తుల నుంచి దానాల పేరుతో అదనపు డబ్బులు వసూళ్ల దోపిడీ పై విచారణ జరిపి అక్రమాలకు తేల్చేరు. ఇందులో ఈవోవ్యవహారంకూడాబయటపడినట్లు సమాచారం.

**కుమారుడి జోక్యం..** ఈవో కుమారుడు కూడా దేవస్థానం వ్యవహారాల్లో అడ్డంకులు సృష్టించారని ఆరోపణలు వచ్చాయి.ఈ సంచలన - తరువాయి 2లో..

## కోనసీమలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని తక్షణమే నిర్మించాలి

- అత్యవసర ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి
- మంజూరైన క్యాన్సర్ డే సెంటర్ నిర్మాణం త్వరిగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలి
- 377ద్వారా లోకసభలో కోరిన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం,మేజర్‌న్యూస్:** డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని తక్షణమే నిర్మించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి 377ద్వారా లోకసభలో కోరారు. జిల్లాలో అత్యవసర ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు లోపించడం వల్ల గ్రామీణ మరియు విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో వైద్యపరమైన సమస్యలపై దృష్టి సారించి జిల్లాలో నెలకొన్న ఆరోగ్య పరిస్థితిపై తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. - తరువాయి 2లో..

### ప్రతి జిల్లాలో

## మాక్ అసెంబ్లీకి చర్యలు



-మంత్రి కందుల దుర్గేష్
-ప్రభుత్వంతో చర్చించి నిర్ణయిస్తామని వెల్లడి
-బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేద్దామని పిలుపు

**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వంతో చర్చించి రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మాక్ అసెంబ్లీ జరిగేలాచర్యలుతీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలోజరిగిన"అమరావతి బాలోత్సవం"లో సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాసరచన, వక్తృత్వ, నృత్య, నాట్య, డ్రాయింగ్ పోటీలను స్వయంగా పరిశీలించారు. కాంతార, భరతమాత,రాణిరుద్రమదేవి,రైతు వేషంలోని చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను ఉత్సాహపరిచేలా ప్రసంగించారు. ఈసందర్భంగా వేలాది మంది విద్యార్థులతోఅమరావతి బాలోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించిన నిర్వాహకులను మంత్రిదుర్గేష్ ప్రశంసించారు.ఈసందర్భంగా బాలోత్సవ కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం అందించేందుకు వారధిగా పనిచేస్తానని మంత్రి కందుల దుర్గేష్ - తరువాయి 2లో..

### గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే

## కూటమి ప్రభుత్వం లక్ష్యం

- యు.జె.పురం, జి.కొత్తపల్లి బీటీ రహదారి పనులకు ఎమ్మెల్యే సత్యప్రభ శంకుస్థాపన



**శంఖవరం,మేజర్‌న్యూస్ :** రహదారులు నిర్మాణంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా అన్నారు. ప్రత్తిపాడు మండలం యు జె.పురం నుండి శంఖవరం మండలం జి.కొత్తపల్లి వరకు నిర్మించబోయే నూతన బీటీ రహదారి పనులకు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభరాజాసోమవారం శంకు స్థాపన చేశారు. పూర్వం నుంచి ఇబ్బందులు పడుతున్న ఈమార్గం అభివృద్ధి చెందితేరెండు మండలాల మధ్య రాకపోకలు మరింత సులభమవుతాయని స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా - తరువాయి 2లో..

# సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్**



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిస్మరణ్‌రాజ్ వైద్య అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మారేడుమిల్లి మండలం బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి మంగళవారం పరిశీలించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది వైద్యాధికారులు ఉన్నది, ఎంతమంది సిబ్బంది ఉన్నది ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని, అదేవిధంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలన్నారు. ఆస్పత్రిలో రోజు ఎంతమంది రోగులకు వైద్య సేవలు అందిస్తు న్నది, అదేవిధంగా ఏ వ్యాధులతో ఎక్కువమంది రోగులు వస్తున్నది ఆయన ఆరా తీశారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది, అదేవిధంగా ఎంతమంది బాలింతలు ఉన్నది ఆయన ఆరా తీశారు.

వివిధ వ్యాధులకు సంబంధించిన మందు లు అందుబాటులో ఉంచాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం మద్దులూరు గ్రామంలోని వెదురు ప్లాంటేషన్ ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ ప్లాంటేషన్‌లో ఎన్ని వేల మొక్కలు ఏర్పాటు చేసింది, అదేవిధంగా ఎన్ని సంవత్సరాలకు వెదురు కటింగ్ వస్తున్నది తదితర విషయాలపై ఆయన ఆరా తీశారు.

# ఏలూరులో అమ్మవార్ల జాతర ఏర్పాట్లపై సమీక్ష

**- హాజరైన 3 కమీటీల పెద్దలు - అధికారులు**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు వన్ టౌన్ పరిధిలోని తూర్పు వీధి, పడమర వీధి,దక్షిణ వీధి అమ్మవార్ల జాతర కమిటీ పెద్దలతో ఆర్డీవో,టౌన్ డీఎస్పీ,వన్ టౌన్ సీఐ ,ఎమ్మార్వో ఉన్నతాధికారులు కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే జాతర ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించడానికి కమిటీ సభ్యులకు పలు కీలక సూచనలు,దిశానిర్దేశం చేయడం జరిగింది. సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు,సూచనలు జాతర బౌండరీస్ (పరిధుల) నిర్ధారణ 3 జాతర కమిటీల పెద్దలతో విడివిడిగా మాట్లాడి, ఆయా జాతరల పరిధులు,ఉత్సవాల నిర్వహణ స్థలాల సరిహద్దులపై స్పష్టత ఇవ్వడం జరిగింది. దీనివల్ల సంఘర్షణలకు తావు లేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవచ్చు.రూట్ మ్యాప్ (మార్గ పటం) తయారీ ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా,శాంతి భద్రతల పర్యవేక్షణకు అనుగుణంగా ప్రతీ వీధి జాతర ఊరేగింపు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని కమిటీలకు సూచించారు.సీసీ కెమెరాల ఏర్పాటు ఊరేగింపు సమయంలో,జాతర పరిసర ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి, పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కమిటీలకు ఆదేశించారు.



- అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ -ఊరేగింపు సమయంలో లేదా జాతర సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు (ఉదాహరణకు అశ్లీల నృత్యాలు, అక్రమ మద్యం సేవించడం, పేకాట మొదలైనవి) నిర్వహించకూడదని, చట్టాన్ని అతిక్రమించకూడదని కమిటీలకు స్పష్టమైన సూచనలు ఇవ్వడం జరిగింది.శాంతి భద్రతలకు ప్రాధాన్యత జాతర ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా, కమిటీ సభ్యులు స్వయంగా పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేయడం జరిగింది.ఈసమావేశం ద్వారా జాతర నిర్వహణలో కమిటీ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధికారుల పాత్ర,చట్టపరమైన అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు.

# ప్రతి జిల్లాలో మాక్ అసెంబ్లీకి చర్యలు

మొదటిపేజి తరువాయి

తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "మంచి గాలి కోసం, మంచి జీవితంకోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం"అనే నినాదంతో ఈ ఏడాది అమరావతి బాలోత్సవం..8వ పిల్లల పండుగ నిర్వహించడం శుభ పరిణామమన్నారు. డిసెంబర్ 9 నుండి 11వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈఅమరావతి బాలోత్సవం విజయవంతం అవ్వాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానన్నారు. అమరావతి బాలోత్సవం అద్భుత కార్యక్రమమని, ఇందులో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. పిల్లల ఆకాంక్షలకు ఆంక్షలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారుల్లో సృజనాత్మకత,వ్యక్తిత్వ వికాసానికి, విద్యా ప్రగతికి, విద్యార్థుల్లో ప్రతిభా పాఠవాలను వెలికితీసేందుకు, నైతికత పెంపొందించేందుకు బాలోత్సవాలు దోహదపడుతాయని తెలిపారు. నిత్యం తరగతి గదిలో సిలబస్, పరీక్షలు, మార్కులు ఇలాఒత్తిడితో ఉండే విద్యార్థులకు చదువుతో పాటు ఇతర అంశాల్లో వారి ప్రతిభను పరీక్షించేందుకు ఇలాంటి వేడుకలు నిర్వహించడం మంచి నిర్ణయం అని పేర్కొన్నారు.వారి శక్తి సామర్థ్యాలు, ప్రతిభను పరీక్షించే వేదికగా బాలోత్సవ వేడుకలు నిలుస్తాయనడంలో అతిశయోక్తి లేదన్నారు. విజేతలుగా నిలవడం ముఖ్యం కాదు ముందు ప్రయత్నం చేయడం ముఖ్యమని ఈ సందర్భంగా అకడమిక్, కల్చరల్ అంశాల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు.కేవలం చదువొక్కటే కాదు ఆటపాటల్లో సైతం విద్యార్థులు పాల్గొనాలని, అప్పుడే తమలో నిగూఢంగా దాగున్న శక్తిసామర్థ్యాలు బయటపడతాయన్నారు. పిల్లల అభిరుచులు తెలుసుకొని తదనుగుణంగా ఉపాధ్యాయులు సైతం తమ బోధనా శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. పిల్లల్లోని ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ విద్యార్థులను ఒకచోట చేర్చి వారి మధ్య ఆట పాటలు నిర్వహించడం, బృంద చర్చలు నిర్వహించడం వల్ల వారిలో స్నేహభావం, ఐకమత్యం, సమానత్వ విలువలు మెరుగుపడుతాయన్నారు. ప్రతి విద్యార్థికి చదువులతో పాటు కళలు, క్రీడలు, ఇతర అంశాల్లో ప్రావీణ్యం ఉంటుందని, తల్లిదండ్రులు తమ ఇష్టాలను పిల్లలపై రుద్దకుండా వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల్లో పట్టుదల, తపన ఉంటే వంద శాతం విజయం సాధించవచ్చని విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. విద్యార్థులు లక్ష్యం వైపు పయనించాలని, విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే పరిపూర్ణమైన విద్యార్థిగా ఎదుగుతారని మంత్రి దుర్గేష్ సూచించారు.ఈసందర్భంగా విద్యార్థుల నడవడికను, వ్యవహార శైలిని, ఆలోచన ధోరణిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని పేర్కొన్నారు. పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసినప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం బయట పడుతుందని తెలిపారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడదామని పిలుపునిచ్చారు. విద్యార్థులే ఈదేశ భవిష్యత్తుకు పునాది అని,విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని అంతరి దుర్గేష్ అన్నారు. తరగతి గదిలోనే అది నిర్మితమవుతుందని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, విజన్ తో ముందుకు వెళ్తేనే అద్భుతాలు సృష్టించగలమని, ఈ క్రమంలో విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.ఆటపాటలతో, ప్రయోగాలతో కూడిన విద్యా విధానం మంచిదని ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత బయట పడుతుందన్నారు.

# అన్నవరం ఈవో వీర్ల సుబ్బారావు బదిలీ

మొదటిపేజి తరువాయి

కథనాల ప్రచురణ, మరియు ప్రజల్లో , భక్తుల్లో పెరిగిన వ్యతిరేకత కారణంగా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెరిగింది.ఫలితంగా,ఈ అవినీతి అధికారిని వెంటనే బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**కొత్త ఈవోగా ఆర్జేడీ త్రినాథరావుకు అదనపు బాధ్యతలు**

కొత్త ఈవో నియామకం జరిగే వరకు, పరిపాలనా దక్షత కలిగిన అధికారిగా పేరున్న రిజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జెడీ)వెంద్ర త్రినాథరావుకు ఆలయ కార్యనిర్వాహణాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**ఆరు నెలలు కొనసాగే ప్రయత్నం విఫలం..**అవినీతి అధికారిగా ముద్రపడిన వీర్ల సుబ్బారావు పదవిలో మరో ఆరు నెలలు కొనసాగడానికి విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ,'సూర్య'కథనాల దెబ్బకు మరియు ప్రజా వ్యతిరేకతకు ఆయన ప్రయత్నాలు ఫలించలేదని తెలుస్తోంది.

**భక్తుల హర్షం..**సంచలన కథను అందించి అవినీతి అధికారి బాగోతాన్ని వెలుగులోకి తెచ్చిన సూర్య పత్రికకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా పరిపాలనా దక్షత ఉన్న అధికారి అయిన త్రినాథరావుకు అదనపు బాధ్యతలు అప్పగించడం పట్ల భక్తులు మరియు ఆలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఆధ్వర్యంలో ఆలయ పరిపాలన మరింత పారదర్శకంగా, మెరుగ్గా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కోనసీమలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని తక్షణమే నిర్మించాలి

మొదటిపేజి తరువాయి

జిల్లాఆసుపత్రి లేకపోవడంతో అత్యవసర చికిత్స కోసం పక్కజిల్లాలపై ఆధారపడుతున్నారన్నారు. జిల్లాలో ట్రామా మరియు పాలీ ట్రామా సెంటర్ లేదా క్రిటికల్ కేర్ సెంటర్ లేకపోవడం వలన క్లిష్టమైన కేసులకు సకాలంలో ప్రాణాపాయ చికిత్స అందించడం సాధ్యం కావడం లేదన్నారు. 17లక్షలకు పైగా జనాభాకు కేవలం తొమ్మిది సామాజిక ఆరోగ్య కేంద్రాలు మాత్రమే సేవలు అందిస్తున్నాయనిదీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నార న్నారు. అలాగే అనేక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు.స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్లు అందుబాటులో లేకపోవడం వల్ల మాతా శిశు సంరక్షణ సేవలు అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కేన్సర్ డే సెంటర్ మంజూరైనప్పటికీ దాని నిర్మాణం ఇప్పటివరకూ మొదలు కాలేదని అన్నారు. కేన్సర్ రోగులు స్థానికంగా చికిత్స పొందలేక ఇబ్బందులు పడటంతో పాటు చికిత్స కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. మంజూరైన డే కేర్ కేన్సర్ సెంటర్‌ను యుద్ధ ప్రాతిపదికన కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మిగిలిన అన్ని సౌకర్యాలను, లోపాలను సరిదిద్ది డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలకు నాణ్యమైన మరియు సకాలంలో ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ హరీష్ బాలయోగి కోరారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్దే కూటమి ప్రభుత్వం లక్ష్యం

మొదటిపేజి తరువాయి

ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ" నియోజకవర్గ అభివృద్ధిలో రహదారులు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. ఎన్నేళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈరహదారి పనులను దశల వారీగా,ప్రణాళికాబద్ధంగా పూర్తిచేస్తాము.రోడ్లు, కాల్వలు, తాగునీరు, విద్యుత్,సంక్షేమ కార్యక్రమాల పరంగా అభివృద్ధిని వేగంగా తీసుకురావడమే మా లక్ష్యం" అని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని కూడాఆమెహామీ ఇచ్చారు .శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్రరోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న ఈశ్వరుడు, నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు పర్వత సురేష్, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్ బద్ది మణి రామారావు, మండల టిడిపి అధ్యక్షులు ఈగల దేవుళ్ళు, మాజీ జడ్పిటిసి బచ్చల గంగ,స్థానిక నాయకులు సర్ణం గోవిందు, ఈగల త్రిమూర్తులు, పాకల ప్రసాద్, ప్రగడ మహేష్, తోట అప్పారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువతరం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# తణుకు బ్రాంచ్లో బీమాసఖి మొదటి వార్షికోత్సవ సంబరాలు

**– ముఖ్యఅతిథిగా ఎల్ఐసి రాజమండ్రి డివిజన్ సేల్స్ మేనేజర్ శర్మ**




**పెరవలి, మేజర్ న్యూస్ :** మహిళా సాధికారతలో భాగంగా ప్రధాన మంత్రి మోడీ గారిచే డిసెంబర్ 9వ తేదీ 2024 న ప్రారంభించబడిన బీమాసఖి స్కీమ్ మొదటి వార్షికోత్సవం సంబరాలు డిసెంబర్ 9వ తేదీ మంగళవారం తణుకు ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎల్ఐసి రాజమండ్రి డివిజన్ సేల్స్ మేనేజర్ ఎన్ఎస్ఎస్ శర్మ భీమా సఖిలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేలా ఎదగాలని మన ప్రధానమంత్రి మోడీ ఆలోచనకు కార్యరూపమే ఈ బీమా సఖీలు అన్నారు. మంగళవారం మొదటి వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా బీమాసఖి లు అందరకు హార్దిక శుభాకాంక్షలు మీరు అద్భుతంగా రాణించి మరింత ఎదుగుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని తద్వారా మీ కుటుంబం కూడా ఉన్నత స్థానానికి చేరాలని ఎల్ఐసి టీం రాజమండ్రి కోరుకుంటున్నది అన్నారు. అదేవిధంగా వారికి వెన్నంటి చేయూతనిస్తున్న వారి భర్తలకు, బ్రాంచి సిబ్బందికి, డెవలప్మెంట్ ఆఫీసర్లకు, చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్లకు, అందరకు కూడా వార్షికోత్సవ శుభాకాంక్షలు అన్నారు. ఈ సందర్భంగా తణుకు ఎల్ఐసి బ్రాంచ్లో బీమాసఖిలుగా జాయిన్ అయి ఉత్తమ పనితీరు కనపర్చిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నెంబర్ ఆఫ్ పాలసీల్లో ఐదవ స్థానంలో నిలిచిన చిటికెన దుర్గాభవాని ని ఆమె మార్గదర్శకుడు చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ సలాది ఉదయభాస్కర రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తణుకు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కెఎస్ఎస్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ బి దుర్గాప్రసాద్, డివోలు లక్ష్మణ్, దేవి, గంగరాజు, చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ సలాది ఉదయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# నల్లల తమ్మయ్య చెరువు మరమత్తు పనులు చేపట్టాలని రైతులు ఆవేదన..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం యర్రవరం లోగల నల్లల తమ్మయ్య చెరువు పల్లపు, మెరక, నీటి సరఫరా అయ్యే కుచాలు శిథిలావస్థకు గురి అవుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయకట్టు రైతు మైరాల కనకారావు మాట్లాడుతూ సుమారు 654 ఎకరాల వ్యవసాయ పంట పొలాలకు ఈ చెరువు ద్వారాసాగు నీరందేదని తెలిపారు. రాను రాను ఈ చెరువు పొర్లు, పల్లపు, మెరక కుంచాలు శిథిలం అవుతున్నా సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించకపోవడం దురదృష్టకరమని రైతులు వాపోతున్నారు. నీటిపారుదల అధికారుల పర్యవేక్షణ లోపంతో నల్లల తమ్మయ్య చెరువు ఆక్రమణలకు గురవుతుందని తెలిపారు. వర్షాకాలంలో పంటలు మునిగిపోవడం, నీటి ఎద్దడి సమయంలో చెరువులో నీళ్లు లేకపోవడం ఈసమస్యల వల్లే జరుగుతున్నాయని ఆవేదన చెందారు. యర్రవరం నుండి పేరవరం గ్రామానికి రైతులు రాకపోకలు జరిపేందుకు ఈ చెరువు వద్ద చెక్ డాం కడితే రెండు గ్రామాలు రైతులకు వీలుగా ఉంటుందని సూచించారు.చెరువులో పెరుగుతున్న గుర్రపు డెక్కను తొలగించి మరమ్మతులు చేపట్టి రైతులకు నీరదించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు.

# భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న తహశీల్దార్ వెంకటలక్ష్మీ**

**పెద్దాపురం, రూరల్,మేజర్న్యూస్ :** దివ్యాంగులను చులకన భావంతో చూడవద్దని వారిచే అద్భుతాలు సృష్టించవద్దని, ఎంతోమంది ఉద్యోగాలు పొంది, ఉన్నత స్థానాలలో ఉన్నారని, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ తెలిపారు. మంగళవారం పెద్దాపురం పట్టణంలోని మహాత్మాగాంధి మున్సిపల్ స్కూల్లో గల భవిత కేంద్రం వద్ద ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, మహాత్మా గాంధి మున్సిపల్ ప్రైమరీ స్కూల్ ప్రధానొపాధ్యాయురాలు కె.పద్మశ్రీ అధ్యక్షతన, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్రెడ్డి, బి.ఆనందరావు, ఐఇడిఎస్ఎస్ టీచర్ భవానిల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రభుత్వం కల్పించే సదుపాయాన్ని వినియోగించుకుని, పిల్లల అభివృద్ధికి వారి తల్లితండ్రులతో పాటు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఆమె తెలిపారు. పెద్దాపురం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తటవర్తి సత్యనారాయణ, దివ్యాంగ పిల్లలకు గిఫ్ట్లు ఇవ్వడం జరిగింది. డా.ఎస్.ఎన్.మూర్తి భవిత కేంద్రంలో పిల్లలకు రూ.5వేల విలువ గల స్పోర్ట్స్ కిట్ను, మండల యుటిఎఫ్ అర్బన్ వారు ప్రొగ్రామ్కు అయ్యే ఖర్చులు సహాయం చేయడం జరిగింది. అనంతరం స్పోర్ట్ మీట్లో విజేతలకు తహశీల్దార్ వెంకటలక్ష్మీ చేతుల మీదుగా




మెడల్స్, బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డా.బి.అపర్ణ, సిఆర్పిలు, మండల విద్యాశాఖ సిబ్బంది ప్రకాష్, మూర్తి, పాల్గొన్నారు. పెద్దాపురం ఫేస్బుక్ గ్రూప్ సభ్యులు దివ్యాంగ విద్యార్థులకు, తల్లితండ్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

# పెరవలి పీహెచ్సీలో గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు



**పెరవలి,మేజర్న్యూస్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెరవలినందు డిసెంబర్ 9వ తేదీ మంగళవారం ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ ప్రోగ్రాం భాగంగా తణుకు రత్నా నర్సింగ్ హెూమ్ నుండి డాక్టర్ అమృత ఎం.డి గైనిక్ పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వాలంటరీగా విచ్చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో నుండి వచ్చిన 28 మంది గర్భిణీలను ఉచిత ఆరోగ్య పరీక్షలుచేసి వారికి తగిన వైద్యం- సలహాలు అందించటమైనదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజనాల ప్రసాద్ తెలియజేశారు.

# ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర యుటిఎఫ్ సంఘం పిలుపు మేరకు ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మంగళవారం పెద్దాపురం మున్సిపల్ సెంటర్ నుండి యుటిఎఫ్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో డివిజన్స్థాయి ర్యాలీ కార్యక్రమం ఆర్డీఓ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయి ంపు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.సూరిబాబు, జిల్లా గౌరవాధ్యక్షులు సాయిరామ్, జిల్లా కార్యదర్శి పి.వి.వి.సత్య నారాయణ, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ, పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.సత్యవేణి, జి.వెంకట్రావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.కెనడి, వి.శివశంకర్, సీతారామ్, ఎం.శివప్రసాద్, కె.సూరిబాబు, సామర్లకోట, కిర్లంపూడి, తుని, కోటనందూరు, జగ్గంపేట, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, గండేపల్లి మండలాల నుండి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శానిటేషన్పై ప్రత్యేక దృష్టి - వైస్చైర్మన్ నెక్కంటి



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పురపాలక సంఘంలో ప్రస్తుత చలికాలం నేపథ్యంలో శానిటేషన్పై ప్రత్యేక దృష్టి సారించాలని, మున్సిపల్ వైస్ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. దీనిలో భాగంగా పెద్దాపురం పురపాలక సంఘానికి కొత్తగా మంజూరైన సుమారు 10 పుష్ కార్ట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో అన్ని వార్డులలో శానిటేషన్పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ఆయన తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ ఆరెళ్ళ రాఘవ, శానిటరి ఇన్స్పెక్టర్ బి.ఆదినారాయణ, వైసిపి నాయకులు బొబ్బిలి హరిబాబు, తదితరులు ఉన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# స్కూల్ బస్సు బోల్తా.. విద్యార్థులకు గాయాలు

- ప్రమాద ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ ఆరా
- ఆర్టిఏ నిబంధనలకు అనుగుణంగా స్కూల్ బస్సులు లేకపోతే కఠినచర్యలు ఉంటాయని స్కూల్ యాజమాన్యాలకు హెచ్చరిక
- స్కూల్ బస్సులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ
- పిల్లల ప్రాణాలతో చెలగాటమాడతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరిక



**పెరవలి,మేజర్‌న్యూస్ :** తీపర్రులో గోదావరి ఏటిగట్టు వద్ద డిసెంబర్ 9వ తేదీ మంగళవారం ఉదయం స్కూల్ బస్సు బ్రేకులు ఫెయిల్ అయి లంక వైపు బోల్తా పడిన ఘటనలో విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాద వార్త తెలిసిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు ఉరుకులు పరుగులతో తీపర్రు గోదావరి ఏటుగట్టు వద్ద ప్రమాద స్థలికి చేరుకుని తమ పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై విజయవాడ పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ కు తీపర్రు గ్రామంలో ఏటిగట్టు పై నుండి తాడిపర్రు జ్యోతి కాన్వెంట్ స్కూల్ బస్సు బోల్తా పడిందని స్థానిక జనసేన నాయకులు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ తెలియజేయడంతో మంత్రి దుర్గేష్ ఈ విషయంపై వెంటనే స్పందించి వాకబు చేసారు. అనంతరం స్వల్ప గాయాలతో స్కూల్ పిల్లలందరూ క్షేమంగా బయటపడ్డారన్న వార్తతెలియ గానే ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే సంబంధిత యాజమాన్యంతో, అధికారులతో మాట్లాడారు. గాయపడిన చిన్నారులకు తక్షణ వైద్య సదుపాయం అందించాలని ఆదేశించారు. తక్షణమే అధికారులను ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించమని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా వాహనాన్ని సకాలంలో మరమ్మతు చేయించాలని స్కూల్ యాజమాన్యానికి సూచించారు. స్కూల్ బస్సులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఆర్టిఏ నిబంధనలకు అనుగుణంగా స్కూల్ బస్సులు లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని స్కూల్ యాజమాన్యాలను హెచ్చరించారు. ప్రమాదం జరిగినప్పుడు బయటకు వెళ్లడానికి ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు ఉండాలని, వాటి వాడకంపై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రైవర్లకు సరైన శిక్షణ, నిర్దిష్ట రూల్స్ పాటించడం పై అవగాహన కల్పించాలని ఆదేశించారు.. పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే స్కూల్ బస్సుల్లో ఏదైనా లోపం కనిపిస్తే సంబంధిత యాజమాన్యంపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు సైతం పిల్లల్ని స్కూలుకు బస్సుల్లో పంపించేటప్పుడు ఆయా బస్సుల పరిస్థితిని కూడా గమనించాలన్నారు. ఏదైనా లోపాలు ఉంటే సంబంధిత కళాశాలకు, పాఠశాలలకు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడతామంటే చూస్తూ ఊరుకోమని మంత్రి కందుల దుర్గేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భవన నిర్మాణ కార్మికుల నూతన కార్యవర్గాన్ని సన్మానించిన బద్దిరెడ్డి

ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ : ఏలేశ్వరంలో నూతనంగా ఎన్నిక కాబడిన శ్రీ విఘ్నేశ్వర భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యవర్గం సభ్యులు వైసిపి రాష్ట్ర యువజన విభాగకార్యదర్శి బదిరెడ్డి గోవింద్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నిక కాబడిన అధ్యక్షుడు గెద్ద అప్పన్న, ఉపాధ్యక్షుడు ధనేడి చిన్నలనుశాలువా, పూలమాల తో సన్మానించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘ అభ్యున్నతికి పాటుపడాలని ఈ సందర్భంగా సూచించారు ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం నగర పంచాయతీ వైసిపి నాయకులు, పేకాల జాన్, జువ్విన వీర్రాజు, గొడుగు నాగేంద్ర, గుండిబెల్లి చక్రం, ఆకుల అనంద్,దత్తి రాజా, తదితరులు పాల్గొన్నారు.



# పెండ్యాల పంపింగ్ స్కీం ద్వారా రైతాంగానికి నీరు విడుదల చేసిన మంత్రి కందుల దుర్గేష్

- హర్షం వ్యక్తం చేసిన రైతాంగం



**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** పెండ్యాల పంపింగ్ స్కీం ద్వారా రైతాంగానికి నీరు అందించడం సంతోషంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలు నియోజకవర్గంలోని విజ్జేశ్వరం గ్రామంలో పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా సాగునీటి విడుదల కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మోటారు స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పెండ్యాల పంపింగ్ స్కీం ద్వారా అన్నదాతలకు సాగునీటి అవసరాలకు నీరు విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. సకాలంలో మరమ్మతులు చేయకపోవడం వల్ల, మోటార్లు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల నీటి విడుదల కార్యక్రమం ఆలస్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు సాగునీటి సంఘం సహకారంతో నీరు విడుదల చేసి రైతుల కళ్ళల్లో ఆనందం నింపడం సంతృప్తిగా ఉందని తెలిపారు. ఇప్పటికే మరమ్మత్తుల ఖర్చుల నిమిత్తం నిధులు విడుదల చేయాలని కోరుతూ జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుకు సాగునీటి సంఘం రాసిన లేఖను అందించానని గుర్తు చేశారు. ఇందుకు దాదాపు రూ.7.5 లక్షలు ఖర్చు అవుతుందని అన్నారు. ఈ విషయమై ఇప్పటికే కమాండ్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కాడా)తో మాట్లాడామని, అక్కడి నుండి అనుమతి రావాల్సి ఉందన్నారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ (ఆర్‌అండ్‌ఆర్)లో విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంతితో ఈ అంశంపై మాట్లాడానని చెప్పారు. ఈ అంశాన్ని ఆమె ఫాలోఅప్ చేస్తున్నట్లుగా మంత్రి వివరించారు. త్వరలోనే శుభవార్త వింటామని అన్నారు. స్థానిక అధికారులు ఈ విషయంపై మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సామర్థ్యవంతమైన నీటి నియంత్రణతో కూడిన నీటిపారుదల వ్యవస్థ పునరుద్ధరణకు, నిరంతర పర్యవేక్షణ నిర్వహణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంత్రి కందుల దుర్గేష్, సాగునీటి సంఘాల చొరవతో సాగునీటి సౌకర్యం లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసిలో మహిళా సమస్యలపై అవగాహన సదస్సు




**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో మహిళలపై డిజిటల్ హింస మరియు రోజువారీ జీవితంలో డిజిటల్ హింస జరిగినప్పుడు సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనేదానిపై అవగాహన సెషన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ వివిధయాప్‌ల డిజిటల్ బ్రౌజింగ్ పట్ల జాగ్రత్తగా ఉండాలని బాలికలను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వతంత్ర ఆసుపత్రి నుండి లాపరోస్కోపిక్ సర్జన్ మరియు జిఎస్ఎల్ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీ జ్యోత్స్న డిజిటల్ హింస ఎలా జరుగుతుంది, ఇది సంభవించినప్పుడు సమస్యను ఎలా ఎదుర్కోవాలి మరియు మహిళలు రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న డిజిటల్ హింసను నివారించడానికి తీసుకోవలసిన నివారణ చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత సమన్వయకర్త బి.రేణుకసాయి శ్రీ,డాక్టర్ ఎన్.దివ్య,డాక్టర్ పివిసీల మరియు ఇతర మహిళా అధ్యాపకులు చురుకుగా పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై వరి ధాన్యం ఆరబెడితే చట్టపరమైన చర్యలు

- ఎస్ఐ చినబాబు



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై రైతులు వరిధాన్యం ఆరబెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామనిఎస్సై చినబాబు హెచ్చరించారు. మంగళవారం జాతీయ రహదారిపై దాన్యం ఆరబెట్టి ఉండడం ఎస్సై చిన్నబాబు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. రహదారి నియమాల ఉల్లంఘనగా పరిగణించబడుతుందని, ఇటువంటి చర్యలు చేయడం వలన రహదారి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఎస్సై రైతులకు సూచించారు. ఇకపై నిబంధనలను అతిక్రమించి రహదారిపై దాన్యం ఆరబెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని రూల్స్ ప్రకారం వ్యవహరించాలని ఆయన సూచించారు.

# పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

- డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖర్‌రెడ్డి



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పంచాయతీ రాజ్ ఉన్నతాధి కారులు ఆదేశాల మేరకు ఎంపిడిఓ కె.వి.సూర్య నారాయణ సూచనల మేరకు మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో శానిటేన్ పనులను డిప్యూటి ఎంపిడిఓ శేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భ ంగా గ్రామంలో ఆయన పర్యటిస్తూ డ్రైన్లలో ఎప్పటికప్పుడు పూడిక తీయించి, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటింటికి వెళ్ళి తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరణ నిర్వహించి, ఎస్‌డబ్లూపి కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉండాలని, చెత్త, చెదారం వీధులలో వేయకుండా పంచాయతి కార్యదర్శి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌డబ్లూపి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీలో హౌస్ టాక్స్ వసూళ్ళు, ఐవిఆర్ఎస్ కాల్స్, సర్వేలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ షావలి, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# జెఎన్టీయుకెలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్

**– ఈ నెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు**

**– ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె ప్రసాద్ వెల్లడి**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్టియుకె క్రీడా ప్రాంగణంలో ఈ నెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు) సహకారంతో జెఎన్టియుకె, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సురంపాలెం మరియు రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సైన్సెస్, కాకినాడ సమ్యుక్తంగా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె ప్రసాద్ తెలిపారు.

ఈ నెల 10వ తేదీన ప్రారంభం కానున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా పి.గణవెంకట రెడ్డి నాయుడు (గణ బాబు), ప్రభుత్వ విప్, విశాఖపట్నం వెస్ట్ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు & వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు పాల్గొని ప్రారంభిస్తారన్నారు. విశిష్ట అతిథులుగా పి.వెంకట రమణ, అర్జున అవార్డు గ్రహీత & మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, డాక్టర్ ఇ.త్రిమూర్తులుగారు, ఏఐయు అబ్జర్వర్, గౌరవ అతిథులుగా సగిలి షాన్ మోహన్, ఐఏఎస్, కలెక్టర్ కాకినాడ జిల్లా, గరికపాటి బిందు మాధవ్, ఐపిఎస్, పోలీస్ సూపరింటెండెంట్ కాకినాడ జిల్లా పాల్గొంటారన్నారు. ఈ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలలోని 138 యూనివర్శిటీల నుండి 1960 మంది క్రీడాకారులు, 300 మంది మేనేజర్లు & కోచ్లు మరియు 60 మంది మ్యాచ్ అధికారులు హాజరవుతున్నారన్నారు.

జెఎన్టియుకె ఆధ్వర్యంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఉపకులపతిప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె ప్రసాద్అధ్యక్షత వహిస్తారని, డా.ఎ.కృష్ణ మోహన్, డైరెక్టర్–స్టూడెంట్ అఫైర్స్, డా.కె.రాము, డైరెక్టర్ – అడ్మిషన్స్ ఆర్గనైజింగ్ కమిటీ అధికారులుగా వ్యవహరిస్తున్నారని యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ & టోర్నమెంట్ కన్వీనర్ డా.జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్స్ సెక్రటరీ డా.జి.పి.రాజు వ్యవహరిస్తున్నారన్నారు. ఈభారీ స్థాయి టోర్నమెంట్ను పగలు – రాత్రి షెడ్యూల్లో నిర్వహిస్తున్నారు. క్రీడల అభివ ృద్ధికి అనేక స్పాన్సర్లు కూడా ముందుకు వచ్చి ఈ పోటీలను ప్రోత్సహిస్తున్నారు.

ఈ టోర్నమెంట్లో మొత్తం నాలుగు బహుమతులు (విజేత,రన్నరప్, మూడవ స్థానం, నాలుగో స్థానం) అందజేయబ డతాయి. లీగ్ మ్యాచ్స్ అర్హత సాధించిన టీమ్స్ కు పోటీలు జెఎన్టియు కాకినాడ స్టేడియంలో జరుగుతాయి.ఈ పోటీలలో నాలుగు స్థానాలు సాధించిన జట్టులు మణిపాల్ యూనివర్సిటీ జైపూర్ జరుగుతున్న అల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలలో పాల్గొంటాయి అని డా.జి.శ్యామ్‌కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె ప్రసాద్ జెఎన్టియుకె ఆధ్వర్యంలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని అధికారులను, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బందిని, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను కోరారు.

# గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో సౌకర్యాలు మెరుగు పర్చాలి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు,హాస్టల్‌లో విద్యార్థులకు సౌకర్యాలు మెరుగు పర్చడంతో పాటు సమస్యలు పరిష్కారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోల్ల బొజ్జిరెడ్డి సూచనలు చేసారు. రంపచోడవరం మండలం పరిధిలోని కెజిబివి స్కూల్, రంపచోడవరం బాలికల ఆశ్రమ స్కూల్, బంధపల్లి బాలుర ఆశ్రమ స్కూల్, బందపల్లి సచివాలయాన్ని రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోల్ల బొజ్జిరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్ల్స్ హాస్టల్స్‌లో టాయిలెట్స్, బాత్రూమ్స్ పరిశుభ్రతపై సూచనలు చేసారు. అలాగే మంచినీటి సరఫరా సమస్యలు గమనించి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన చిన్న పాటి మరమ్మతులను గుర్తించి, వెంటనే పరిష్కరించేందుకు గిరిజన సంక్షేమ కమిషనర్‌కు సూచనలు జారీ చేశారు. బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేసి, నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలని అదేశించారు.



# ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతా

**– సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దొమ్మా శ్రీను**



**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతానని దొమ్మా శ్రీను అన్నారు. ఇప్పటివరకు గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వహించిన బలిరెడ్డి వరలక్ష్మి గత నెల 17వ తేదీన మృతి చెందారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్‌గా ఉన్న దొమ్మా శ్రీను సర్పంచ్‌గా మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వార్డు మెంబర్ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి,బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా దొమ్మ శ్రీను మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పరంగా సేవలందించేందుకు ఈపదవి అలంకరణ ఒక వరంగా భావిస్తున్నాను అన్నారు. పంచాయతీ కార్యవర్గ సభ్యులు, ప్రజలు నాపై ఉన్న నమ్మకాన్ని ఒమ్ము కాకుండా పార్టీలకు అతీతంగా,కుల మత బేధాలు లేకుండా ప్రజాసేవ చేస్తానని తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న అనేక సంక్షేమ ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగాచర్యలు తీసుకుంటానని తెలియజేశారు. అంతేకాకుండా పంచాయతీ కార్యవర్గ సభ్యుల సహాయ సహకారాలతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దొమ్మ శ్రీనును కమ్మ కార్పొరేషన్ చైర్మన్ పోతుల మోహన్‌రావు దుస్సాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆయనను అభినందించారు. పరిపాలన విధంగా పక్షపాతం లేకుండా పరిపాలన చేసి గ్రామానికి, పార్టీకి మంచి పేరు తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహన్ రావు,మాజీ సర్పంచ్ బలిరెడ్డి గంగరాజు,టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు తెలగరెడ్డి భద్రరావు, కాటేపల్లి భద్రం,రావిపాటి వెంకటరావు, కొత్త శివయ్య,కొల్లి త్రిమూర్తులు,గ్రంధి నాగబాబు,రామకుర్తి నరసింహ,తెలగ రెడ్డి ప్రకాష్,వెలిది సుబ్రహ్మణ్యం,చింతపల్లి భద్రరావు, బలిరెడ్డి గణేష్,పంచాయతీ కార్యదర్శి బిక్కిన బాల వీరేంద్ర చౌదరి,పంచాయతీ కార్యవర్గ సభ్యులు,సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, కూటమి యకులు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రీయ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి

**– జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ కుమార్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** సేంద్రీయ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయకుమార్ అన్నారు. పిఠాపురం మండలం విరవ గ్రామంలో... ఇండిగ్యాప్ పొలంబడి క్షేత్రస్థాయి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ... రైతులు రసాయనిక వ్యవసాయం తగ్గించి సహజ మరియు సేంద్రియ వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించి అంతర్జాతీయ మార్కెట్‌ని కూడా అందిపుచ్చుకోవచ్చని తెలియజేశారు. త్వరలో విరవ గ్రామాన్ని పూర్తిగా రసాయన రహిత లేదా సేంద్రీయ వ్యవసాయ గ్రామంగా తీర్చిదిద్దాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పొలంబడి దృశ్య రూపము రైతులను ఆకట్టుకుంది.ఆదర్శ రైతులు తమ్మనబోయి నాగేశ్వర రావు, అచ్యుతరామయ్య, కృష్ణ, మొదలగు వారిని సత్కరిం చారు. ఈకార్యక్రమంలో పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాల కులు పి.స్వాతి,మండల వ్యవసాయ అధికారి గంగాధర్ గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు మాజీ ఎంపీపీ కురుమళ్ళ రాంబాబు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీలు రైతులు పాల్గొన్నారు.

## మాటా మంతి ప్రోగ్రాంకి అడ్డతీగల ఎంపీడీవో ఎంపిక

**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** పదవ తేదీ బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మాట మంత్రి కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ నుండి అడ్డతీగల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కుమార్ ఎంపికైనట్లు ఉన్నతాధికారులు తెలియజేశారు ఏజెన్సీలోని ప్రతి డివిజన్ పరిధిలోని గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలుసుకునేందుకు మరియు ఇక్కడ పని చేస్తున్న అధికారుల నుండి పలు సూచనలు స్వీకరించేందుకు మరియు ప్రజల అవసరార్థం పలు సూచనలు చేసేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరిలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రంపచోడవరం డివిజన్ తరపున అభివృద్ధి పనుల తీరును అవసరమైన పలు సూచనలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి నేరుగా తెలియజేసే అవకాశం అడ్డతీగల ఎంపీడీవో కుమార్‌కి రావడం పట్ల పలువురు అధికారులు అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా ప్రారంభమైన జగన్మోహిని కేశవస్వామి పవిత్రోత్సవాలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామివారి పవిత్రోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోపూజ, గో ప్రదక్షణం, విశ్వక్సేన పూజ, పుణ్యా వచనం, బ్రుతిక్వర్ణ దీక్ష ధారణ, స్నాపనం, అకల్మస హెూమం, నీరాజనం మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, వాస్తు పూజ, శాంతి హెూమం తదితర కార్యక్రమాలు కనులు పండుగ జరిగాయి. స్వామివారికి దేవస్థానం చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

# కుక్క కరిసిందని ఫోన్ చేస్తే నర్సు దారుణ వ్యాఖ్యలు

- వైద్య ఆరోగ్యశాఖలో ఎంఎల్‌హెచ్‌పీ నిర్వాకం..
- నువ్వేమైనా సీఎం చంద్రబాబు నాయుడువా అంటూ ఎటకారం



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** కుక్కకాటుకు గురైన ఓ మహిళకు ప్రాధమిక చికిత్సకోసం వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుండా నువ్వేమైనా సీఎం చంద్రబాబు నాయుడువా అంటూ ఎటకారంగా మాట్లాడడంపై బాధితురాలు ఉన్నతాధికారులకు పిర్యాదు చేసింది..ఈసంఘటనకు సంబందించి బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లవరం మండలం బోడసకుర్రులో అంగన్ వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న దొమ్మేటి కృష్ణవేణి డ్యూటీకు వెళ్తుండగా వీధి కుక్క దాడిచేసి కరిచింది.. దీంతో ఆమె తీవ్ర భయభ్రాంతులకు గురయ్యింది. దీనిపై స్థానికులు అది పిచ్చికుక్క అని చెప్పడంతో మరింత భయభ్రాంతులకు గురై ఆందోళనకు గురైంది..

ఈక్రమంలోనే వెంటనే గ్రామంలో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వర్తిస్తున్న విజయకు ఫోన్ చేయగా ఆమె ఎత్తలేదు. ఇలా మూడు సార్లు ఫోన్ చేసినా ఎత్తకపోగా అంతలో అక్కడికి వచ్చిన బాధితురాలి భర్త కూడా ఎంఎల్ హెచ్‌పీ విజయకు ఫోన్ చేశాడు. చివరకు నాలుగు సార్లు చేయగా ఫోన్ లిఫ్ట్ చేసిన ఎంఎల్‌హెచ్‌పీ తీవ్ర అసహనం ప్రదర్శిస్తూ కుక్క కరిస్తే వెంటనే ఫోన్ ఎత్తేయాలా..? నవ్వు ఏమైనా సీఎం చంద్రబాబు నాయుడువా నువ్వు ఫోన్ చేసిన వెంటనే ఎత్తేయడానికి అంటూ దారుణంగా మాట్లాడిందని వాపోయింది. తాను వచ్చే దాకా ఉంటే ఉండు లేకుంటే మానేయ్ అని ఫోన్ పెట్టేసిందని తెలిపింది. దీంతో చేసేది లేక స్థానికులు, భర్త సాయంతో అల్లవరం 30 పడకల ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నట్లు తెలిపింది. సాటి ఉద్యోగి అని కూడా చూడకుండా ఇంత దారుణంగా మాట్లాడిన నర్సు విజయపై చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు.

గోడిలంక పీహెచ్‌సీ సిబ్బంది అంటేనే నిర్లక్ష్యమా...?

గోడిలంక పీహెచ్‌సీ అనగానే సిబ్బంది వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పీహెచ్‌సీ సిబ్బంది విధి నిర్వహణలో అలక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నందుకే అదనపు డాక్టర్ బాలరాజుపై సిబ్బంది తప్పుడు ఫిర్యాదు చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే డాక్టర్‌ను వేరే పీహెచ్‌సీకు డిప్యుటేషన్‌పై వెళ్లేలా రాజకీయ పైరవీలు చేయించారని, ఆ స్థాయిలో ఇక్కడ రాజకీయాలు ఉన్నాయంటున్నారు. ఇప్పుడు తాజాగా బోడసకుర్రు ఎంఎల్‌హెచ్‌పీ ఓ పేషెంట్‌పై దారుణ వ్యాఖ్యలు చేయడం సంచలనంగా మారింది. అయినా ఉన్నతాధికారులు ఈ పీహెచ్‌సీపై దృష్టిపెట్టి చక్కదిద్దడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.

# అనారోగ్యంతో బాధితులకు రజక సంఘం ఆధ్వర్యంలో వితరణ



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ :** రజక కులానికి చెందిన నిరుపేద కుటుంబం పునుగుపాటి లక్ష్మి పార్వతి పేగులలో స్టోన్స్ ఉండడం వల్ల అనారోగ్య పరిస్థితి.కొడుకు హరికిరణ్ తలలో బ్రెయిన్ ట్యూమర్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు పట్టణ అపార్ట్మెంట్ వాచ్మెన్ అసోసియేషన్ వారు ,రజక సంఘం వాట్సాప్ గ్రూపుల ద్వారా ఇచ్చినవి కలిపి ఆ కుటుంబానికి 25వేల రూపాయలు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఎపి ఎంఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు చాటపర్తి పోసిబాబు మాట్లాడుతూ ఎంతోమంది పెద్దలు దాతలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఉన్నారని ఈ నిరుపేద కుటుంబాన్ని ప్రతి ఒక్కరు ఆదుకోవాలని ఈ ఇద్దరికీ ఆసుపత్రి ఆపరేషన్ ,ఖర్చుల నిమిత్తం 5లక్షల వరకు అవుతుందని దయా హృదయం ఉన్న ప్రతి ఒక్కరు స్పందించాలని జిల్లాలో ఉండే రజక సంఘం సభ్యులు,రాజకీయ నాయకులు ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ అపార్ట్మెంట్ వాచ్మెన్ అసోసియేషన్ నాయకులు సంపంగి నాని,మెట్ట సత్య నారాయణ ములగాల లక్ష్మణ్ తలుపుల సుబ్రహ్మణ్యం బెల్లంకి అప్పారావు పేట మాణిక్యం కంబాల రాంబాబు యండమూరి రమేష్ చిలంతరాజుల వెంకటేశ్వరరావు ములగాల మంగ కూచింపూడి కృష్ణకుమారి గుంపుల నాగరాజు కడకట్ల కోటేశ్వరరావు పల్లంట్ల సత్యనారాయణ బండి శ్రీను గుండె పల్లి దుర్గారావు పాలూరి మధు తదితరులు పాల్గొన్నారు.

## 13 జరిగే జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలి : న్యాయమూర్తి వాసంతి

**నర్సాపురం,మేజర్ న్యూస్ :** ఈ నెల 13న నర్సాపురంలోని అన్ని కోర్ట్ సముదాయాలలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవలసినదిగా ,అందుకు న్యాయవాదులు, పోలీస్ అధికారులు సహకరించవలసినదిగా నర్సాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ 10వ అధనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన అన్ని క్రిమినల్ కేసులు,ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద భీమా కు సంభంధించిన కేసులు, సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాలు ఉభయ కక్షిదారులను సమన్వయ పరిచిరాజీ చేయబడునని బ్యాంక్, బి.ఎస్.ఎన్.ఎల్ కు సంభంధించిన ప్రీ లిటిగేషన్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. వర్చ్యువల్‌గా కూడా కేసులను రాజీ చేసుకొనే వెసులుబాటు ఈ జాతీయ లోక్ అదాలత్ కు ఉందన్నారు. ప్రతీ రోజు కోర్టు సముదాయంలో జరుగుతున్న మధ్యవర్తిత్వంను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని,పంతాలకు పోయి, సమయాన్ని, డబ్బును వృధా చేసుకోకుండా, త్వరితగతిన కేసుల నుండి విముక్తి పొందడానికి ఈ జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

# ఆత్మస్థైర్యంతో మెలగాలి




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రతిభావంతులు అందరూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాష, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్ రాజు, ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్. వెంకట్ రామన్‌లు అన్నారు. మంగళవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ వరప్రసాదరావు, ఏ.సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు విభిన్న ప్రతిభ కలిగి ఉంటారని, వారిలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సాహించాలన్నారు. పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత ఉండేటట్లు తల్లిదండ్రులు తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాల్యంలో మందబుద్ధి కలిగిన వారు జీవితంలో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగిన దృష్టాంతాలను వివరించారు. తల్లిదండ్రులు ప్రేమతో, ఓర్పుతో బిడ్డలను పెంచే విధానం అద్భుతమని, తమ బిడ్డలు ఎందులోనూ తీసిపోరని ఆశావహ దృక్పథంతో ఉండడం సమాజానికి ఇస్తున్న మంచి సంకేతం అని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల అవసరాల నిమిత్తం ప్రభుత్వం నుండి అనేక సంక్షేమ కార్యక్రమాల జరుగుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తదుపరి పోటీలలో గెలుపొందిన దివ్యాంగ బాలలకు మెడల్స్, బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన దాతలకు చిరు సత్కారం జరిగింది. తదనంతరం 'డొక్కా సీతమ్మ సేవా సమితి' వారిచే దివ్యాంగ విద్యార్థులకు, పాల్గొన్న తల్లిదండ్రులకు చక్కటి విందు భోజనం ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష, అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ రాంబాబు, ఐ.ఈ.ఆర్. జిల్లా కోఆర్డినేటర్ సత్యనారా యణ, ఐఈఆర్‌టి అరుణ, జానకి, ఉపాధ్యాయులు ఎస్.వి.వి.ఎన్.ఎస్. ప్రసాద్, సురేష్, ఆఫీసు సిబ్బంది రాంబాబు, ప్రశాంతి, సి.ఆర్.ఎంటీలు రాజేంద్ర, ఆత్మారావు, సుధాకర్, జాన్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో నాగబాబుకు 3 పతకాలు



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** తెలంగాణా రాష్ట్రంలోని సికింద్రాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ స్టేడియంలో ఇటీవల జరిగిన 7వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీల్లో సామర్లకోటకు చెందిన యాతం నాగబాబు 3 విభాగాల్లో పతకాలు సాధించారు.ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడితూ పోటీల్లో 1500, మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం, 800,400 మీటర్ల రన్నింగ్‌లో కాంస్య పథకాలను సాధించినట్టు చెప్పారు. సామర్లకోటకు చెందిన నాగబాబు ప్రస్తుతం పచ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ భీమవరం కార్యాలయంలో జిల్లా సహాయ మలేరియా అధికారిగా పనిచేస్తున్నారు. కాగా ఈయన 2013నుంచి 2025 సంవత్స రం వివిధ జాతీయ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ పరుగు పందెం పోటీల్లో ఇప్పటి వరకు 100 నుంచి 1500 మీటర్ల విభాగాల్లో పాల్గొని 20 బంగారు పతకాలు, 23 వెండి పతకాలు, 26 కాంశ్య పతకాలు వెరసి 68 పతకాలు సాధించినట్టు నాగబాబు చెప్పారు. ఈసందర్భంగా పతకాలు సాధించిన నాగబాబును పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

## వాడపల్లి వెంకన్న ధర్మకర్తల పాలకమండలి సభ్యునిగా తమ్మన సాయి ప్రసాద్



**అమలాపురం, మేజర్ న్యూస్ :** కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో వేంచేసి కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయం ధర్మకర్తల పాలకమండలి సభ్యునిగా కొత్తపేటకు చెందిన తమ్మన సాయి ప్రసాద్ నియమింపబడ్డారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులుగా పనిచేసిన ఈయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్ గాను కొత్తపేట ఆర్యవైశ్య సంఘ జాయింట్ సెక్రటరీ గాను పనిచేస్తున్నారు. ఈయన నియామకము పట్ల రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, అమలాపురం శ్రీ సుబ్బాలమ్మ దేవస్థానం ధర్మకర్తలపాలక మండలి చైర్మన్ అప్పన్న వీరన్న, అమలాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ముఖ్య సలహాదారు, తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యుడు వరదా సూరిబాబు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## వేముల దీవిలో బాల్య వివాహ ముక్త్ భారత్



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్:** మండలంలోని వేముల దీవి పంచాయతీ ఈస్ట్ పంచాయతీ జిల్లా పరిషత్ హై స్కూల్లో బాల్యవివాహ ముక్తభారత్ కార్యక్రమం నిర్వహించారు. 100రోజుల కాంపెయిన్‌లో భాగంగా మంగళ వారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్ బి. నెహెమ్యా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పేదరికం,బాల్య వివాహం పట్ల అవగాహన లేకపోవడం వల్ల బాల్య వివాహలు జరుగుతున్నాయని స్కూల్ పిల్లలకు వివరించారు.ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యా అభ్యసించాలన్నారు.

చిన్ననాటి నుండి చదువుతోపాటు క్రమశిక్షణ అలవరుచు కోవాలన్నారు. బాల్యవివాహనికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు ,అంగ న్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోటి సంతకాల సేకరణలో అమలాపురం ఫస్ట్

**- మాజీ మంత్రి విశ్వరూప్**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం నియోజకవర్గం అత్యధిక సంతకాలు సేకరణ చేపట్టిందని మాజీ మంత్రి, అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త పినిపే విశ్వరూప్ తెలిపారు. అమాలాపురంలో ఆయన స్వగృహం వద్ద మంగళవారం నిర్వహించిన మీడియాసమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ప్రభుత్వం చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో నియోజకవర్గానికి 60 వేలు సంతకాలు సేకరించాలని అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశించారని, అయితే కోనసీమ జిల్లాలో ఉన్న ఏడు నియోకవర్గాలలో అమలాపురం నియోజకవర్గం అత్యధికంగా 75 వేల సంతకాలు సేకరించి జిల్లాలో అత్యధిక సంతకాల సేకరణ చేపట్టిన నియోజకవర్గంగా అమలాపురం నిలిచిందని మాజీ మంత్రి విశ్వరూప్ తెలిపారు. మొత్తం ఏడు నియోజకవర్గాలకు సంబంధించి సేకరించిన సంతకాల పత్రుల బాక్సులు బుధవారం జిల్లా కేంద్రమైన అమలాపురం చేరతాయని, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో ఇక్కడి నుంచి తాడేపల్లి పంపిస్తామని వెల్లడించారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి తోపాటు పార్టీ ముఖ్యనేతలు గవర్నర్ ను కలిసి ఆయనకు అందజేస్తారని తెలిపారు. అనంతరం పార్టీ నేతలకు జగన్మోహన్ రెడ్డి తదుపరి చేపట్టబోయే కార్యక్రమాలను దిశ, నిర్దేశాలను సూచిస్తారని అన్నారు. అమలాపురం నియోజకవర్గ సమన్వ యకర్త డాక్టర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ అమలాపురం నియోజకవ ర్గంలో అత్యధికంగా సంతకాల సేకరణ చేపట్టడంలో ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేశారని, మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ అనేది కూటమి ప్రభుత్వ దుర్మార్గపు చర్య అన్నారు. ఇప్పటికైనా భేషాజాలను విడిచి ప్రయివేటీకరణను విరమించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, నాయకులు చెల్లుబోయిన శ్రీను, మున్సిపల్ ఫ్లోర్ పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు, దంగేటి రాంబాబు, జడ్పిటీసీలు పందిరి హరిబాబు, కొనుకు గౌతమి, ఖాదర్, ఉండ్రు బాబ్జి తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ సుబ్బారావు జన్మదిన వేడుకలు



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** బిజెపి నాయకులు మోకా వెంకట సుబ్బారావు పుట్టినరోజు వేడుకలు అమలాపురంలో అత్యంత ఘనంగా జరిగాయి. వాటర్ హౌస్, నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం పార్క్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు సమావేశంలో, బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో యాళ్ళ దొరబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరరావు, చిక్కాల రాంబాబు, తిక్కిరెడ్డి నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోనం సత్తిబాబు, చింతల పూడి సత్తిబాబు, తిక్కిరెడ్డి వాసు, గోకరకొండ సూరిబాబు, కొమ్ముల సురేష్, అత్తిలి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి నాయుడు, సాధనాల ఆది శేషు, చిక్కాల డాక్టర్ బాబు ముద్దుబాబు, మండేల బాబీ, అబ్బాస్, రంబాల సత్యనారాయణ, ఎండి బషీర్, రంకి రెడ్డి కృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపినవారిలో వున్నారు.

# వాడపల్లి వెంకన్న ధర్మకర్తల మండలి నియామకం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ధర్మకర్తల మండలి నియామకాన్ని ఖరారు చేస్తూ మంగళవారం దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ నెలలో ఆత్రేయపురానికి చెందిన తెలుగుదేశం నేత ముదునూరి వెంకటరాజును చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం 17 మంది సభ్యులను నియమించారు. చలుమూరి రాంబాబు, గంగవరపు పద్మావతి, కాసా చాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్, పెండెం కుమారి, పెండ్యాల భవాని, సలాది నాగేశ్వరరావు, సరళ, సరిత, ఏపుగంటి విజయ కుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయి ప్రసాద్, ఎల్లమిల్లి చంద్రకుమారి, రామచంద్రరావు, శిష్ట సూర్య కుటుంబరావు, దళిపర్తి శ్రీలక్ష్మి, గోసాల అప్పలనర్సమ్మ, ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా వాడపల్లి సుందర శేషావతారం నియమితులయ్యారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు.





## కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్క్రబ్ టైఫస్ పై అవగాహన



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్క్రబ్ టైఫస్ మీద అవగాహనా కార్యక్రమం కౌన్సిలర్ నారే వాసు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కౌన్సిలర్ వాసు మాట్లాడుతూ చింతూరు మండలంలో తొలి స్క్రబ్ టైఫస్ కేసు కొత్తపల్లిలో ఒక వ్యక్తికి పాజిటివ్ వచ్చిందని, గిరిజన గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసుకునేవారు, అదే విధంగా నైట్ ప్రయాణాలు చేసేవారు, అడవిలో కట్టెలు తీసుకునే సమయంలో అజాగ్రత్తగా ఉండకుండా ఉండకూడదన్నారు. ఎటువంటి పురుగు కుట్టినా, ఒంటిమీద దద్దుర్లు వచ్చినా, జ్వరం, అలసట, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిదని పేర్కొన్నారు. గ్రామాల్లో పొలాల్లో ఇవి ఎక్కువగా ఉండటం వలన బట్టలు దులిపి వాడుకోవడం, బూట్లు ధరించేటప్పుడు చూసుకోవడం, మంచం మీద దిండ్లు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వాసు చెప్పారు. స్క్రబ్ టైఫస్ అంటే ఏమిటి?..స్క్రబ్ టైఫస్ అనేది చిగ్గర్స్ అనే చిన్న కీటకం లాంటి పురుగులు ద్వారా వ్యాప్తి చెందే బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ అని, వీటిని మీరు సాధారణంగా మీ కళ్ళతో చూడలేరన్నారు.

ఈ పురుగులు పొదలు, గడ్డి, వ్యవసాయ భూములలో నివసిస్తాయని, కుట్టినప్పుడు అవి మనుషులకు ఇన్ఫెక్షన్‌ను వ్యాపింపజేస్తాయని, అదే విధంగా ఒకసారి వ్యాధి సోకిన తర్వాత 6-21 రోజుల్లోపు తీవ్రమైన జ్వరం, చలి, తలనొప్పి, అలసట రావచ్చునని తెలిపారు. చాలామంది రోగులు కాటు ప్రాంతంలో ఎస్చార్ అని పిలువబడే నల్లటి పొరలుగా ఉండే పుండును గమనిస్తారని, ఇది స్క్రబ్ టైఫస్ యొక్క ముఖ్యమైన సంకేతం అని చెప్పారు.

ముందుగానే చికిత్స చేయకపోతే, ఇన్ఫెక్షన్ ఊపిరితిత్తులు, మెదడు, మూత్రపిండాలు, ఇతర అవయవాలకు వ్యాపి చెందుతుందని వాసు అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ స్టాఫ్, రోగులు పాల్గొన్నారు.

# గర్భిణీల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కృషి





**- శంఖవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పిఎంఎస్ఎంఎ ఆరోగ్య శిబిరం..**
**ఉచిత భోజన వసతి ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ**

**శంఖవరం,మేజర్‌న్యూస్ :** మహిళల ఆరోగ్యం, ప్రసవానంతర సంరక్షణ మా ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది అని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పిఎంఎస్ఎంఎ) కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 9వ తేదీ నిర్వహించే ప్రత్యేక గర్భిణీ ఆరోగ్య శిబిరం శంఖవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించారు. గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్య బృందం సమగ్ర పరీక్షలు నిర్వహించి, హై రిస్క్ గర్భిణీలను గుర్తించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు, శిబిరానికి హాజరయ్యే గర్భిణీ స్త్రీల కోసం అదనపు సౌకర్యంగా ఉచిత భోజన వసతి అందించేందుకు కత్తిపూడి గ్రామానికి చెందిన రాజా వత్సవాయి బుచ్చి సీతమ్మ మహారాణి బహదూర్ సత్రం వారు ముందుకు రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమాజ సేవలో భాగంగా ఇలాంటి సేవలు అందించటం పట్ల స్థానికులు ప్రశంసలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సత్యప్రభ, ఆసుపత్రిలో చేసిన ఏర్పాట్లు, భోజన వసతి, వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ "మహిళల ఆరోగ్యం, ప్రసవానంతర సంరక్షణ మా ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య అంశం. ప్రతి గర్భిణీకి నాణ్యమైన వైద్యం, సురక్షిత ప్రసవం అందించడమే పిఎంఎస్ ఎంఎ లక్ష్యం" అని ఎమ్మెల్యే తెలిపారు. ఆమె సూచనలతో ఆరోగ్యశాఖ మరింత సమగ్ర సేవలు అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు పర్వత సురేష్, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న ఈశ్వరుడు, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్ బద్ది మణి రామారావు, మండల వైద్యాధికారి ఎస్ఎస్ రాజీవ్ కుమార్, బుచ్చి సీతయ్యమ్మ సత్రం చైర్మన్ సోమరౌతు మౌళి, కార్య నిర్వహణ అధికారి యర్రా వెంకటేశ్వరరావు ,మండల టిడిపి అధ్యక్షులు ఈగల దేవుళ్ళు, కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి బచ్చల గంగ, యాళ్ల జగదీష్, వెలుగుల నానీ, వైద్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విలువ ఆధారిత నాయకత్వం ప్రాముఖ్యతపై సదస్సు






**ఏలూరు,మేజర్‌న్యూస్** : ఈ నెల 5,6 తేదీలలో తూర్పు భారతదేశంలోని ప్రావిన్స్ ఆఫ్ ఇమ్మాక్యులేట్ కన్సెప్షన్ ఆధ్వర్యంలో ప్రావెన్స్ స్థాయి కార్యక్రమంగా స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో జెన్ లీడ్2.0బూట్ క్యాంప్ నిర్వహించబడింది. ప్రధానాచార్యులు డాక్టర్ సిస్టర్ పి మెర్సి ప్రావెన్స్ స్థాయిలోని వివిధ పాఠశాలల , కళాశాలల విద్యార్థి నాయకులను పరిచయం చేయగా ఊరేగింపుతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సెయింట్ ఆన్స్ స్కూల్, భంజానగర్, ఒరిస్సా, సెయింట్ ఆన్స్ స్కూల్, మంగళపాలెం, సెయింట్ ఆన్స్ స్కూల్, నిడదవోలు, సెయింట్ థెరిసా స్కూల్, కాలేజ్ ఏలూరు, విద్యాసంస్థల నుండి విద్యార్థి నాయకులు హాజరయ్యారు. అనంతరం కళాశాల సుపీరియర్, కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్ట్ టైం ఫెర్నాన్ డేస్ ప్రారంభోపన్యాసం లో విలువ ఆధారిత నాయకత్వం ప్రాముఖ్యతను వివరించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సిస్టర్ సుశీల హృదయపూర్వక స్వాగత వచనాలతో ప్రారంభమైన కార్యక్రమం పరస్పర పరిచయాలతో, ఉత్సాహంగా సాగింది. ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ ప్రతిభావంతమైన నాయకుల తయారీలో భావోద్వేగ మేధస్సు, శ్రేయస్సు పాత్రను భావి నాయకులకు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ సునీలరాణి,భావవ్యక్తీకరణలో మౌఖికఆంగికసంభాషణలు, మాట్లాడడం, వినడం సానుకూల ప్రభావాలతో ఆచరణాత్మక మార్గదర్శకత్వం వహించడంపై అవగాహన కల్పించారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ డి ఫాతిమారాణి కృషి,సహకారం ఉమ్మడిలక్ష్యాల కోసం కలిసి పనిచేయడం ప్రాముఖ్యతను తెలియజేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి శ్రీనివాస రావు ప్రస్తుత సమాజంలో కృత్రిమ మేధఆవశ్యకతను వివరించారు. విజయలక్ష్మి ఎంబీఏ విభాగం వారు సామూహిక చర్చలు సమూహాలను ఎలా సమర్థవంతంగా నడిపించవచ్చో వివరించారు.

ఈ కార్యక్రమాన్ని ప్రావిన్షియల్ డాక్టర్. సిస్టర్ శౌరిలు, సుపీరియర్, కరస్పాండెంట్ మదర్ ఎర్నస్టీన్ ఫెర్నాండెజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ.పి,వైస్–ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ సునీలా రాణి, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ డి.ఫాతిమా రాణి,ఇంగ్లీష్‌మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాల వారు నిర్వహించారు . ఈనాయకత్వ శిబిరం యువ విద్యార్థులు కనుగొనడానికి ఆత్మ విశ్వాసాన్ని,నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి వేదికగా నిలిచింది.